సర్వే షురూ



టీఆర్టీ గ్రౌండ్స్ వద్ద సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్



సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం బాగ్ అంబర్‌పేటలో సమగ్రా కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి మూడు రోజులు అధికార యంత్రాంగం ఇంటింటికీ సర్వేకు సంబంధించిన స్టిక్కర్లు అంటిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారిణి రజితతో పాటు పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లో..



సర్వే కార్యక్రమంలో పాల్గొన్న బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు ముషీరాబాద్‌లోని భరత్‌నగర్, శివాలయం వీధుల్లో ఇంటింటికి వెళ్లి ఇంటింటి కుటుంబ సర్వే స్టిక్కర్లను అంటించారు. మొదటి రోజు కేవలం స్టిక్కర్లు అంటించే కార్యక్రమం నిర్వహించారు. 9వ తేదీ నుంచి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎన్యూమరేటర్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. సర్వే ద్వార పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు కృష్ణవేణి, స్వప్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి

చిక్కడపల్లి: సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో టీఆర్‌టీ గ్రౌండ్స్ వద్ద ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో టీఆర్టీ గ్రౌండ్స్ వద్ద ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ముఠానరేశ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పి.రాజ్‌మోహన్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పాశం రవి, జహంగీర్, వంశీ, కుమారస్వామి, ఏఈ మురళి పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటి నుంచే సమగ్ర సర్వే..

కుటుంబ వివరాలు తెలిపి సర్వే ప్రారంభించిన పావని



వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ అధికారులతో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించింది. మొదటి సర్వే వివరాలను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వారి నివాసం నుంచే ప్రారంభించారు. కార్పొరేటర్ బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ కలిసి తమ కుటుంబ సర్వే వివరాలను అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న సమగ్రకుటుంబ సర్వే కార్యక్రమానికి అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన వివరాలను అందించి ప్రజలందరు సర్వేకు సహకరించాలని కోరారు. మొదటి విడతగా ఈ నెల 6, 7, 8వ తేదీలలో సర్వే నిర్వహించాల్సిన ఇళ్లకు మార్కింగ్ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారన్నారు. కార్పొరేటర్ నివాసం వద్ద మొదలైన సర్వే కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, ట్యాక్స్ ఇన్స్‌క్టర్ శ్రీనివాస్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుల గణన పారదర్శకంగా జరగాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం పారదర్శకంగా జరగాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. కుల గణన చేయడం వల్లనే జనాభా శాతాన్ని బట్టి రిజర్వేషన్ల కేటాయింపు చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. దేశంలో కుల వివక్ష, అసమానతలు ఉన్నాయని అవి ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు కూడా ఈ కుల గణన కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అయితే కులగణన చాలా పారదర్శకంగా జరగాలని కులగణనపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

- మూసీ నది పునరుద్ధరణ సమస్యను తక్షణ పరిష్కరించాల్సిన సమస్యగా ముందుకు తేవడాన్ని ఆయన విమర్శించారు. దాని కోసం లక్ష 50 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయాలని పూనుకోవడం సరికాదన్నారు. మూసీ నది తీరం వెంట వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా వాటిని తొలగించాలనుకోవడం అన్యాయం అన్నారు.
- రైతు బరోసా, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500 లాంటి హామీలను గాలికొదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నేతలు రమా, సూర్యం, ఎస్ఎల్ పద్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక, కులగణనను స్వాగతిస్తున్నాం: నర్సయ్య



ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేను తెలంగాణ జన సమితి స్వాగతిస్తోందని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం అడిక్‌మెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వే ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జనాభాతో పాటు ఆయా వర్గాల ఆర్థిక అసమానతల వివరాలు సైతం తెలుస్తాయన్నారు. ఈ సర్వే ద్వారా ఏఏ వర్గాల ప్రజలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారో ఆ వర్గాలకు చేయూతనిచ్చే విధంగా సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని ఆయన వెల్లడించారు. బీసీల జనాభాకు తగ్గట్లుగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కోసం ఈ సర్వే కొలమానంగా రానున్నందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సర్వేకు సహకరించి తమ తమ కులాలను సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలియపరచాలని సూచించారు. ఈ సర్వేలో వెల్లడించిన వివరాలు గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, నగర ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం

లంబాడి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజ్‌కుమార్ జాదవ్

కాచిగూడ: తెలంగాణపోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని లంబాడి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. సమస్యలపై మాట్లాడుదామని వెళ్తే ఎండీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. సంస్థలో తులసీధర్‌రెడ్డి అనే అగ్రవర్ణ కుల వ్యక్తి ఐదు పోస్టులను అక్రమంగా నిర్వహిస్తూ ఎస్టీ ఇంజినీర్లను మానసిక వేదనకు గురి చేస్తున్నారని అన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారని ఆరోపించారు. తన వర్గానికి ప్రమోషన్లు, పోస్టింగ్‌లు ఇచ్చుకుంటూ ఎస్టీ ఉద్యోగులపై వివక్ష చూపిస్తున్నారని అన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని హైకోర్టు ఆర్డర్ ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించని పక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

బీఆర్‌టీయూ అనుబంధ సంఘం అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్



నియామక పత్రం అందుకుంటున్న రాంబాబు యాదవ్, ఎలమయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లై సీవరేజీ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) సంస్థలోని బీఆర్‌టీయూ అనుబంధ సంఘానికి అధ్యక్షుడిగా జి.రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎలమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ అనుబంధ సంఘాన్ని గెలిపించాలని కోరారు. ఇతర కార్మిక సంఘాలను కలుపుకుపోవడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. రోజురోజుకి వాటర్‌వర్క్స్‌లో పనిచేస్తున్న సమస్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. వాటి పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.నారాయణ, మారయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

జంగాగౌడ్‌కు కాకతీయ మహానంది పురస్కారం



జంగాగౌడ్‌కు పురస్కారం అందజేసి సత్కరిస్తున్న ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ సంఘ సేవలకులు గడ్డమీది జంగాగౌడ్‌ను కాకతీయ మహానంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అంజలి వీడియోగ్రాఫ్, అందరి టీవీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో కాకతీయ మహానంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జంగాగౌడ్ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉంటూ అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్నందుకు ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు.

‘లక్ష మెదళ్లను కదిలించే శక్తి కలానికే ఉంటుంది’

నవ భారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు రవికుమార్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: లక్షలాది మెదళ్లను కదిలించే శక్తి ఒక్క కలానికి మాత్రమే ఉంటుందని నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ అన్నారు. కవులు, కళాకారులు, రచయితలు ప్రపంచ శాంతికై తమ కలం, దళం ద్వారా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవ భారత నిర్మాణ సంఘం, ఐపీవైజీ హెచ్‌డబ్ల్యూపీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి రచయితల పత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ... ప్రపంచంలో జరుగుతున్న అల్లర్లు, దేశాల మధ్య జరిగే యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతికోసం రచనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కుమారి పోలగాని భానుతేజశ్రీ ఆలపించిన కవిత అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి వామణరావు, అమృత్‌కుమార్ జైన్, సరోజినీదేవి, టి.భారతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి



శ్రీరాంనగర్ బస్తీలో డ్రైనేజీ మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: డ్రైనేజీ సమస్యలపై వాటర్‌వర్క్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి అధికారులను కోరారు. బుధవారం శ్రీరాంనగర్ బస్తీలో డ్రైనేజీ సమస్యపై స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన మరమ్మతులు చేయించారు. అధికారులు డ్రైనేజీ వాటర్ సమస్యను పట్టించుకోకుంటే సహించేది లేదన్నారు. బీజేపీ నాయకులు కిరణ్ కుమార్, ఎన్.శ్రీనివాస్, మాధవ్‌సింగ్, శైలేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం



కాచిగూడలో మాట్లాడుతున్న బద్దుల బాబురావు యాదవ్, లక్ష్మణ్‌యాదవ్

కాచిగూడ: యాదవ మహాసభ కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వానికి చేస్తున్న అభ్యర్థన మేరకు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించి జీవో విడుదల చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీంద్రనాథ్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో తెలంగాణలోని అన్ని జిల్లాల యాదవ సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సమావేశాలు ఏర్పాటు చేసి సీఎంకు అభినందనలు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ నేతలు రమేష్‌యాదవ్, ఎడ్ల హరిబాబుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కన్నె రమేష్‌యాదవ్, సి.లడ్డూయాదవ్, డి.శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని శ్రీనివాసా సారీహౌస్ పక్కన రోడ్డులో నూతనంగా ఏర్పాటు రూ.7లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అనేక నెలలుగా రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పనులు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కొత్త రోడ్డు నిర్మాణంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్, జెల్లా భిక్షపతి, మహ్మద్ జహంగీర్, ముచ్చకుర్తి ప్రభాకర్, అబ్బూ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఆటో డ్రైవర్లు ఇప్పుడు గుర్తుకొచ్చారా?



నారాయణగూడలో మాట్లాడుతున్న కౌషల్ సమీర్, రుద్రాక్ష మల్లేష్

కాచిగూడ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటో డ్రైవర్లను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని అఖిల భారత అసంఘటిత కార్మికులు అండ్ ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కౌషల్ సమీర్, రాష్ట్ర ఆటో విభాగం ప్రధానకార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ అన్నారు. బుధవారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లు, ఆటో సంఘాల నేతలను గేటు దగ్గరకు రానివ్వలేదన్నారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఆటో డ్రైవర్లు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల మాయమాటలకు ఆటో సంఘాల నాయకులు పడొద్దని కోరారు. ఆటో డ్రైవర్లను అడ్డుపెట్టుకుని కేటీఆర్ తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్లకు అన్ని రకాలుగా న్యాయం చేయడానికి ఒక ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వంపై బురదజల్లే బీఆర్ఎస్ నాయకుల మాటలు ఎవరూ నమ్మరని వారు స్పష్టం చేశారు.

వేడుకగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవం



పూజలో వి.హనుమంతరావు, నిర్వాహకులు

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి ఆలయ బొడ్రాయి పునఃప్రతిష్ఠ, భూమిపూజ ఘనంగా జరిగింది. బుధవారం అంబర్‌పేట ప్రధానరోడ్‌లో నిర్వహించిన భూమిపూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు దుర్గాప్రసాద్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, గడ్డం శ్రీధర్‌గౌడ్‌తో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మతతత్వ ఫాసిస్టు శక్తులను ఓడించాలి



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో మతతత్వ ఫాసిస్టు శక్తులను ఓడించాలని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ పిలుపునిచ్చారు. ఈనెల 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మద్దికాయల అశోక్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని విమర్శించారు. ప్రజా ప్రత్యామ్నాయాన్ని నిర్మించేందుకు కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలన్నారు. పెరుగుతున్న ఆహార, ఇంధన ధరలు, నిరుద్యోగం లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు పాస్లా, గాదగోని రవి, గంగాధరన్, కిరణ్‌జిత్‌సింగ్, కాటం నాగభూషణం, చంద్రమోహన్ ప్రసాద్, వనం సుధాకర్ పాల్గొన్నారు.

..ఆ 5లక్షల ఓట్లు పద్మశాలీ అభ్యర్థులకే పడాలి

ఏబీపీఎస్ జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి



కాచిగూడ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పద్మశాలీ అభ్యర్థుల విజయానికి పద్మశాలీలు కృషి చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం (ఏబీపీఎస్) జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బోల్ల శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి అభ్యర్థులను గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మహారాష్ట్రలోని ఐదు లక్షల తెలుగు ఓట్లు మన పద్మశాలీ అభ్యర్థులకే పడేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, బిళ్ల దీపిక, బొమ్మ ప్రవళ్లిక, మాచర్ల రాంచందర్, చిలుకూరి మాధవి, కొక్కుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార దోషులను శిక్షించాలి

ముషీరాబాద్: మధురానగర్‌లోని ఓంనగర్‌లో 50 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.పద్మ, వై.వరలక్ష్మి, సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో బాలికలు, మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో విచ్చలవిడిగా బెల్టుషాపులలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గంజాయి, మత్తు పదార్థాల వాడకాన్ని నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలు.. 55 కేసులు నమోదు



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 55మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మాక్ ఐక్యరాజ్య సమితి



అంతర్జాతీయ సంబంధాలపై పలు సూచనలు ఇస్తున్న డాక్టర్ మనీషా, సిమ్రాన్

కవాడిగూడ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బుధవారం ఏవీ కళాశాలలో మాక్ ఐక్యరాజ్య సమితిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 పాఠశాలలు, 20 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను గురించి తెలిపేలా మాక్ ఐక్యరాజ్య సమితి కొనసాగింది. ప్రపంచ శాంతితోనే అన్ని దేశాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రపంచంలో అంతరించిపోతున్న జంతు సంపదను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల పరిజ్ఞానాన్ని డీల్ చేయడానికి, వారి నైపుణ్యాలను మెరుగుపర్చడానికి ఎంతో దోహద పడుతుందని ప్రొ. డా.మనీష అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు, బెస్ట్ డెలిగేట్, బెస్ట్ ప్రజెంటేషన్ అవార్డు-2024ను అందజేస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

తరలించరు అంటే స్పందించారు.!



బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

నల్లకుంట: పాత నల్లకుంట డాక్టర్ చారిలేన్‌లో ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు అల్లుకుపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను పది రోజుల క్రితం విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగింపజేశారు. తొలగించిన కొమ్మలను అక్కడే వదిలేశారు. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన స్థానికులు సమస్యను ‘సాక్షి’దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ‘తొలగించారు.. కానీ తరలించరు.!’అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురింతమయ్యింది. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య విభాగం అధికారులు వెంటనే వీధుల్లో కుప్పలుగా ఉన్న కొమ్మలను తొలగించారు. కాగా చెట్ల ఆకులను పూర్తి స్థాయిలో తొలగించలేదని, వాటిని కూడా పూర్తిగా తొలగించాలని సిబ్బందిని కోరగా గురువారం వీధులు శుభ్రం చేసేందుకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బంది ఊడ్చి శుభ్రం చేస్తారని చెప్పారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కరించిన ‘సాక్షి’కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



చెట్ల కొమ్మలను తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

